కేసీఆర్ కృషి.. పంచాయతీ ఖుషీ

- పంచాయతీల పురోగతి సూచికలో దేశంలోనే 2వ స్థానం
- 2022-23 నాటికి దేశంలో పురోగతి సాధించిన గ్రామాల్లో తెలంగాణ నుంచే 270 పంచాయతీలు ఎంపిక
- పల్లెప్రగతికి కేసీఆర్ పెద్దపీట
- నాటి శ్రమ, ప్రాధాన్యం కారణంగానే నేటి ఫలాలు

రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించిన టాప్-10 పంచాయతీలు

ర్యాంకు	పంచాయతీ పేరు	మండలం	జిల్లా	మార్కులు
1	బుర్నాపూర్	పిట్లం	కామారెడ్డి	84.09
2	తిమ్మాపూర్	తిమ్మాపూర్	కరీంనగర్	82.79
3	మునిపల్లి	జక్రాన్‌పల్లి	నిజామాబాద్	81.29
4	మోర్తాడ్	మోర్తాడ్	నిజామాబాద్	81.29
5	గుండంపల్లి	దిలావర్‌పూర్	నిర్మల్	81.28
6	కల్వల	కేసముద్రం	మహబూబాబాద్	80.82
7	చెన్నారం	కోస్గి	నారాయణపేట	80.80
8	మరియాపురం	గీసుకొండ	వరంగల్	80.71
9	దేవునిగూడెం	జన్నారం	మంచిర్యాల	80.49
10	బండపల్లి	చందుర్తి	రాజన్న సిరిసిల్ల	80.41

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనా దక్షతకు మరో గుర్తింపు దక్కింది. బీఆర్ఎస్ హయాంలో పల్లెప్రగతికి ఇచ్చిన ప్రాధాన్యానికి అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ పల్లెలకు ఉత్తమ ఘనత దక్కింది. 'పంచాయతీ పురోగతి' సూచికలో దేశంలోనే రాష్ట్రం అ'ద్వితీయం'గా నిలిచింది. దేశంలోని గ్రామ పంచాయతీలు 2022-23 నాటికి సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక (పీఏఐ)ను విడుదల చేసింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానం కైవసం చేసుకున్నది. దేశవ్యాప్తంగా 699 పంచాయతీలు టాప్‌లో నిలువగా, ఇందులో గుజరాత్, తెలంగాణ నుంచే అధిక గ్రామాలు ఉన్నాయి.

అ'ద్వితీయం'.. కేసీఆర్ పథకాలు

తొమ్మిది అంశాల ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ 'పంచాయతీ పురోగతి' సూచికను ప్రకటించింది. వాటిలో పేదరిక నిర్మూలన, పంచాయతీల్లో జీవనోపాధి పెంపు, ఆరోగ్యం, చైల్డ్‌ఫ్రెండ్లీ, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు ఉన్నాయి. వీటికి నాటి కేసీఆర్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. పేదరిక నిర్మూలన, పంచాయతీల్లో జీవనోపాధి పెంపునకు కేసీఆర్ సర్కారు అధిక నిధులు కేటాయించింది. రూ.200 పింఛన్‌ను రూ.2,016కు పెంచారు. షరతులు, బ్యాంకు లింకేజీ లేకుండా దళితబంధు కింద ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షలు అందజేశారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉండేవారికి, కులవృత్తులవారికి ఇతోధికంగా ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు అందించింది. డంపింగ్‌యార్డుల ద్వారా ఎరువుల ఉత్పత్తికి ఊతమిచ్చింది.

నాడు

కేసీఆర్ హయాంలో నిజామాబాద్ శ్రీనగర్ పల్లె ప్రకృతివనంలో పరుచుకున్న పచ్చదనం

నేడు

నేడు రేవంత్ సర్కారు నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారిన దుస్థితి

గ్రామాల్లో ఆరోగ్యం, తాగునీరు

కేసీఆర్ తలపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా వెంటవెంటనే ఎత్తివేయడానికి ట్రాక్టర్‌ను అందించింది. డంపింగ్ యార్డులను ఏర్పాటుచేసింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించింది. ఫలితంగా అనేక వ్యాధులు దూరమయ్యాయి. జిల్లాలు, మండలాల ఏర్పాటుతో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మ ఒడి పథకాలు మహిళలకు వరంగా మారాయి. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతోచిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన జరిగింది.

పారిశుధ్యం, పచ్చదనం, భద్రత..

కేసీఆర్ పాలనలో పల్లెలు పారిశుధ్యం, పచ్చదనంతో పరిఢవిల్లాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రతీ గ్రామానికి కేటాయించిన ట్రాక్టర్ పారిశుధ్యరంగంలో కొత్త చరిత్రను లిఖించింది. మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య సిబ్బందికి వేతనాలు కంఫన్‌గా అందాయి. కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన తెలంగాణకు హరిత హారంతో పచ్చదనం వెల్లివిరిసింది. ఊరూరా మౌలిక వసతులు సమకూరాయి. తొమ్మిది అంశాల ఆధారంగా ఈ ర్యాంక్‌లు కేటాయించగా.. గుజరాత్‌లోని 346, తెలంగాణలో 270 పంచాయతీలు ఏ గ్రేడ్ దక్కించుకుని తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

గ్యాస్ ధరలను తగ్గించాలని కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో సీపీఎం నాయకుల నిరసన

వంట గ్యాస్ ధరలు తగ్గించాల్సిందే

- సీపీఎం, సీపీఐ నాయకుల డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- కేంద్రం దిష్టిబొమ్మల దహనం

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 9: కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ నాయకులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనలు, ధర్నాలు, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఖాళీ సిలిండర్లు నెత్తిన పెట్టుకొని, ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ బస్టాండ్ వద్ద కట్టెల పొయ్యిపై వంట చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఖాళీ సిలిండర్లను రోడ్డుపై ఉంచారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులోని ప్రధాన రహదారిపై అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జూలూరుపాడులో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, ప్రజాపంథా నాయకులు ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. బూర్గంపహాడ్, ఇల్లెందులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆదిలాబాద్‌లోని సీపీఐ కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో చేశారు. బోథ్‌లో తహసీల్దార్ సుభాష్‌చందర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు గ్యాస్ సిలిండర్లతో నిరసనకు దిగారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు.

ట్రిపుల్ ఆర్ అనుమతులు వేగవంతం చేయండి

- అధికారులకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ సూచనలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్ఆర్) ఉత్తర భాగం అనుమతుల ప్రక్రియ వేగవంతం కోసం కేంద్ర రోడ్డురవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సూచించింది. ప్రతిపాదిత హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ కోసం చర్యలు చేపట్టాలని తెలిపింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ ఫిబ్రవరి 3న సమావేశం నిర్వహించారు. ఆ మినిట్స్‌ను ఇటీవల రెండు రాష్ట్రాలకు పంపారు.

నేడు యూనివర్సిటీల బంద్

- అన్ని యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ పిలుపు
- క్రమబద్ధీకరణ డిమాండ్‌తో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోరుబాట
- జేఏసీ నేతల అరెస్టు, ఎక్కడికక్కడ అడ్డగింత, గృహనిర్బంధం
- ఉన్నత విద్యామండలిని ముట్టడించిన అధ్యాపకులు

ఉన్నతవిద్యామండలి కార్యాలయం ముందు కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అధ్యాపకులు, అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్/సూర్యాపేట, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ)/హనుమకొండ చౌరస్తా/రామగిరి: క్రమబద్ధీకరణ కోసం గొంతెత్తితే సర్కారు ఉక్కుపాదంతో అణచివేతకు దిగడం దారుణమని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ మండిపడింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం యూనివర్సిటీలు బంద్ పాటించాలని జేఏసీ బంద్‌కు అన్ని వర్సిటీలకు చెందిన విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయని తెలిపారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం మార్గదర్శకాల పేరుతో ప్రభుత్వం దొడ్డి దారిలో జీవో 21 జారీ చేసిందని మండిపడ్డారు.

అడుగడుగునా అరెస్టులు... నిర్బంధాలు

రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ అధ్యాపకుల జేఏసీ పిలుపునిచ్చిన 'చలో హైదరాబాద్' ఉద్రిక్తంగా మారింది. బుధవారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించారు. గేటు ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టుచేసి, 15 పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అలాగే జేఏసీ నేతలు, అధ్యాపకులను మంగళవారం అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టు, గృహనిర్బంధం చేశారు. హైదరాబాద్‌కు బయల్దేరిన కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండలో మహాత్మాగాంధీ వర్సిటీ అధ్యాపకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం, పోలీసుల వైఖరిని జేఏసీ నేతలు బైరి నిరంజన్, కరుణాకర్‌రావు, రాజేశ్, జితేందర్‌రెడ్డి, శ్రీధర్ ఖండించారు. అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు మాటతప్పడం దారుణమని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ప్రజాఉద్యమం తప్పదు

ప్రజాపాలన అని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్సిపాళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా వదలడం లేదని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విమర్శించారు. డిమాండ్ల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్ధరాత్రి అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు. ఇలాగే అరెస్టులు చేస్తూ పోతే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీనే అమలు చేయాలని కోరితే నిర్బంధించడమేంటని ప్రశ్నించారు. అటు.. కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్లపై ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు గురువారం ఉన్నత విద్యామండలి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

నిరసిస్తే అరెస్టులా?

కాంట్రాక్ట్ అధ్యాపకుల పోస్టులను క్రమబద్ధీకరించాలి. జేఎల్, డీఎల్‌ల పోస్టులను రెగ్యులరైజ్ చేసినప్పుడు మా పోస్టులను ఎందుకు రెగ్యులర్ చేయలేకపోతున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం ఏంటి?

- బైరి నిరంజన్, కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ రాష్ట్ర నాయకుడు

బీఆర్ఎస్ సర్కార్ రెగ్యులరైజ్ చేసింది

కేసీఆర్ హయాంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లను క్రమబద్ధీకరించారు. అప్పుడు అడ్డురాని నిబంధనలు ఇప్పుడెలా అడ్డువస్తున్నాయి? మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకాడుతున్నది. మాకు న్యాయం జరిగే వరకు విడిచిపెట్టే ప్రసక్తేలేదు.

-పరుశురామ్, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్

నక్క పంది ఓ అడవి!

అక్కడేదో కలకలం
దేశమంతా ఒక్కసారిగా
అటుగా చూపు నిలిపెను!

వీరు
అక్కడ నక్కలున్నాయనిరి
వారు కాదు
అక్కడ పందులున్నాయనిరి
అది విన్న అడవి పొడిగా నవ్వి
అన్ని జీవులకు వాసం
నా ఒడియె అనెను!

రెచ్చిపోయిన స్వరముతో వీరు
వారిని
అక్కడ అడవి ఎక్కడిదనిరి?!

కళ్ళు ఆకుపచ్చగా చేసి అడవి
గుడ్డివాడా!
మీరు లోలోన దాచుకున్న
నల్ల ధనము కాదు నేను
ఆకాశమెత్తు ఎదిగిన
నిలువెత్తు హరిత సౌందర్యమే నేను!

అంతలో అల్లంత దూరంలో
పక్షుల కలకలారవాలు
జంతువుల ఆహాకారాలు
కోరలు నూరుతున్న బుల్డోజర్లు!

శ్వాస ఆగిన రీతి ఒకరు
రక్తముడికిన తీరు మరొకరు
మాటల కత్తులకు కొదవేలేదు
ఎరుపెక్కెను నలు దిక్కులు!

ఇంతలో వాదోపవాదాల నడుమ
ఒక్కసారిగా ధర్మదేవత కళ్ళు తెరిచెను
ఎక్కడి దొంగలు
అక్కడే గప్పుప్!

ఓ నల్ల కుక్కా!
నక్కలు పందులు
ఒంటి కాళ్ల మీద లేచెను
ఢిల్లీ ఆగ మేఘాల మీద
యుద్ధక్షేత్రమున మొలిచెన్!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 9440233261

37 డిమాండ్లను నెరవేర్చండి : ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన 37 డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ సలహాదారు కే కేశవరావును కలిసి 37 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత చికిత్స, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలని, రూ.10లక్షల వరకు పెండింగ్ బిల్లులను గ్రీన్‌చానల్ ద్వారా విడుదల చేయాలని కోరారు.

ప్రైవేట్ కాలేజీల ఫ్యాకల్టీపై ఆరా!

- ఇంటర్‌బోర్డు చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ జూనియర్ కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఫ్యాకల్టీ వివరాలపై ఇంటర్ బోర్డు ఆరా తీస్తున్నది. ఫ్యాకల్టీకి పీజీ అర్హతలున్నాయా? లేవా? అని పరిశీలిస్తున్నది. ఫ్యాకల్టీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఆదేశాలిచ్చింది. అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తైన తర్వాత ప్రైవేట్ కాలేజీల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ పేర్లు, ఫొటోలను కాలేజీల్లో ప్రదర్శించాలని ఆదేశించనున్నది. పాఠశాలల్లో ఫేక్ టీచర్లను అరికట్టేందుకు ఫొటోలు ప్రదర్శించాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

ఫొటోల కోసమైతే మేం రాం!

సమయమిస్తాం.. చర్చిస్తామంటేనే వస్తాం • చర్చల తర్వాత 'ఎస్' ఆర్ 'నో' చెప్పాల్సిందే

- మా డిమాండ్లపై చర్యలేంటి?
- వివరాలు తెప్పించుకున్నారా?
- విజ్ఞప్తులపై ప్రిన్సిపల్ సెక్రటరీలు నోట్స్ సిద్ధం చేసుకున్నారా?
- ఏమీ లేకుండా చర్చలంటే ఎలా?
- డిప్యూటీ సీఎం పేషీలోని ఒక అధికారిపై ఉద్యోగుల ఆగ్రహం
- జేఏసీతో 12న చర్చలు సందిగ్ధం

12న చర్చలు అనుమానమే

ఉద్యోగ సంఘాల జేఏసీ నేత సర్కారుపై ఆగ్రహించిన నేపథ్యంలో ఈ నెల 12న చర్చలు జరగడం అనుమానంగానే కనిపిస్తున్నది. పైగా సమావేశానికి ఆహ్వానించాల్సిన సంఘాల నేతల సమాచారాన్ని కూడా ఇవ్వకపోవడంతో అసలు చర్చలుంటాయా? లేదా? అన్న అనుమానాలొస్తున్నాయి. జేఏసీ నేత చెప్పిన విషయాలన్నింటినీ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి, మళ్లీ కబురు పంపుతామని పేషీలోని ఉన్నతాధికారి చెప్పడం కూడా ఇందుకు బలం చేకూరుస్తున్నది. అయితే, ఇదే విషయంపై మరో నేత మాట్లాడుతూ.. ఈ నెల 12న దాదాపు చర్చలు జరగకపోవచ్చునని, అదనంగా రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నదని చెప్పారు.

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): '57 డిమాండ్లను సర్కారు ముందుంచాం. ముఖ్యమంత్రి, మంత్రులకు విన్నవించాం. ప్రిన్సిపల్ సెక్రటరీలను వందల సార్లు కలిశాం. 16 నెలల్లో మా డిమాండ్లపై ఏం చేశారు? సర్కారు స్పందనేమిటి? డిమాండ్లపై శాఖల నుంచి వివరాలు తెప్పించుకున్నారా? ప్రిన్సిపల్ సెక్రటరీలు నోట్స్ సిద్ధంచేశారా? ఇవేవీ లేకుండా చర్చలకు రండి.. వినతిపత్రాలివ్వండి.. ఫోజులు కొట్టండి.. ఫొటోలు దిగి వెళ్లిపోండి అంటే మాత్రం మేం చర్చలకు రాలేం. శాఖల నుంచి నోట్ లేకుండా చర్చలంటే మేం నమ్మాల్నా? చర్చల పేరుతో ఎవర్ని మోసం చేద్దామనుకుంటున్నారు? ఇదే విషయం కావాలంటే డిప్యూటీ సీఎంకి కూడా చెప్పండి'- ఇవీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేషీలోని ఒక ఉన్నతాధికారితో ఉద్యోగ సంఘాల జేఏసీ నేత ఫోన్‌లో చెప్పిన మాటలు.

కంగుతిన్న అధికారి

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం చర్చలు జరపకపోవడం, తమ సమస్యలు పరిష్కారంకాకపోవడంతో మార్చి 12న ఉద్యోగ జేఏసీ ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా పలు జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న చర్చలకు రావాలంటూ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలను ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సమావేశానికి ఎవరిని ఆహ్వానించాలో జాబితా కావాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేషీలోని ఉన్నతాధికారి ఒకరు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతకు ఫోన్‌చేశారు. తీవ్ర ఆగ్రహానికి గురైన జేఏసీ నేత పేషీలోని ఉన్నతాధికారికి క్లాస్ పీకినంత పనిచేశారు. దీంతో కంగు తినడం సదరు ఉన్నతాధికారి వంతయ్యింది.

సమయమిస్తాం.. చర్చిస్తామంటేనే వస్తాం..

మంత్రివర్గ ఉపసంఘం చర్చల్లో ఒక్కో డిమాండ్‌పై చర్చిస్తామని, సమయం ఇస్తామంటేనే చర్చలకు వస్తామని జేఏసీ నేత స్పష్టంచేసినట్టు సమాచారం. 'మేమిచ్చిన వాటిలో 45 ఆర్థికేతర అంశాలే. 12 మాత్రమే ఆర్థికపరమైనవి ఉన్నాయి. చర్చలకని పిలిచి ఫొటోలు దిగి వెళ్లిపొమ్మంటే కుదరదు. సమావేశానికి ముందే మేమిచ్చిన డిమాండ్లపై శాఖల వారీగా నోట్స్ తెప్పించుకోండి. మేమిచ్చిన డిమాండ్లను నెరవేరుస్తారా? లేదా? అన్నది అక్కడికక్కడే స్పష్టంచేయాలి. మేం హెల్త్‌కార్డులు ఇవ్వాలని మొత్తుకుంటుంటే, మళ్లీ హెల్త్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పొడిగించారు. మేం అడిగింది ఏమిటి? మీరు చేస్తున్నది ఏమిటి?' అంటూ సదరు ఉన్నతాధికారిని ప్రశ్నించినట్టు తెలిసింది.

పాత ప్రభుత్వమని ఎన్నాళ్లు తప్పించుకుంటారు?

'సీఎం, డిప్యూటీ సీఎం అంతా సానుకూలంగా ఉన్నామంటారు.. మరి, ఇప్పటివరకు ఒక్క సమస్య అయినా పరిష్కారమైందా?' అని జేఏసీ నేత సదరు అధికారిని నిలదీసినట్టు సమాచారం. 'మమ్మల్ని దారుణంగా అవమానిస్తున్నారు. ముగ్గురు మంత్రులు మమల్ని లెక్కేచేయడంలేదు. ప్రిన్సిపల్ సెక్రటరీలైతే దారుణంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు అసోసియేషన్ నేతల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. 206 సంఘాలతో జేఏసీగా మేం ఏర్పడితే, రెండో జేఏసీని మీరే ప్రోత్సహిస్తున్నారు. అదర్ డ్యూటీ (ఓడీ)లు ఇష్టారాజ్యంగా ఇస్తున్నారు. ఓడీ ఇచ్చిన వారి సభ్యత్వ మెంత? వారికి సభ్యులున్నారా?' అంటూ తన అసంతృప్తినంతా వెళ్లగక్కినట్టు తెలిసింది. 'ఇంకా ఎంతకాలం పాత ప్రభుత్వమని తప్పించుకుంటారు? జీవో-317 పాత ప్రభుత్వమే తెచ్చింది. మీరు తప్పులు సరిదిద్దుతామన్నారు కదా! మీరు పెండింగ్ డీఏలు లేకుండా చేస్తామన్నారు కదా! పీఆర్సీ ఇవ్వాల్సింది మీరే కదా! మాకు పాత, కొత్తతో సంబంధం లేదు. పాత ప్రభుత్వం.. కొత్త ప్రభుత్వంతో మాకేం పని? ఉద్యోగుల సంక్షేమమే మా ఎజెండా. మా 57 డిమాండ్లపై ఏదో ఒకటి తేల్చుతామంటేనే చర్చలకు వస్తాం' అంటూ జేఏసీ నేత స్పష్టంచేసినట్టు సమాచారం.

హెచ్‌సీయూకు బీజేపీ ఎంపీలు

- వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశం
- భూముల అమ్మకాల స్కాంలో బీజేపీ ఎంపీ పాత్ర ఉన్నదన్న కేటీఆర్ ఆరోపణలను ప్రస్తావించిన మీడియా ప్రతినిధులు
- భుజాలు తడుముకున్న ఎంపీలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల అమ్మకంలో భారీ స్కాం జరిగిందని, అందులో బీజేపీకి చెందిన ఒక ఎంపీ హస్తం ఉన్నదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించిన నేపథ్యంలో బీజేపీ ఎంపీలు హెచ్‌సీయూను సందర్శించారు. ఈటల, రఘునందన్‌రావు, విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం వర్సిటీకి వెళ్లి వీసీ, రిజిస్ట్రార్‌తో భేటీ అయ్యారు. కంచ గచ్చిబౌలి భూములు యూనివర్సిటీకి చెందినవా? లేక ప్రభుత్వానికి చెందినవా? అని అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ చేసిన ఆరోపణలను విలేకర్లు ప్రస్తావించారు. దీనికి రఘునందన్ బదులిస్తూ.. 'బీజేపీ ఎంపీ పేరు బయటకి వస్తే నిజానిజాలు తెలుస్తాయి కదా' అని సమాధానాన్ని దాటవేశారు. లీగల్ అంశాలు తెలుసుకొనేందుకు హెచ్‌సీయూకు వచ్చామని, తాము పరిశీలించిన అంశాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

గురుకుల టీచర్లకు వేతనాలు రాలే

- పార్ట్‌టైమర్లకు రెండు నెలలుగా అందని జీతాలు
- వెంటనే విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాల్లోని రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఇప్పటికీ వేతనాలు చెల్లించలేదు. 10వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్ట్‌టైం టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీకి 2 నెలలుగా వేతనాలు అందలేదు. ప్రతినెలా ఒక నిర్ణీత తేదీ అంటూ లేకుండా, ఇష్టారీతిన వేతనాలు చెల్లిస్తున్నారని గురుకుల ఉద్యోగులు వాపోతున్నారు. దీంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోతున్నామని, అదనంగా జరిమానాలు చెల్లించాల్సి వస్తున్నదని పేర్కొంటున్నారు. కుటుంబాలను పోషించడానికి అవస్థలు పడాల్సి వస్తున్నదని, అప్పులు పాలవుతున్నామని పార్ట్‌టైం ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గురుకుల ఉద్యోగులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం (టీఎస్ డబ్ల్యూఆర్‌టీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.